సాక్షి అనకాపల్లి

సోమవారం । 27 । నవంబర్ । 2023

7



సరుగుడులో కోలాహలం

నాతవరం మండలంలో ఏజెన్సీ గ్రామం సరుగుడు. ఈ ప్రాంతం వన సమారాధనకు నిలయంగా మారింది. 8లో



జూకు కార్తీక శోభ

కార్తీక మాసం రెండో ఆదివారం కావడంతో ఆరు వేలకు పైగా సందర్శకులు ఇందిరా గాంధీ జూ పార్కును సందర్శించారు. 8లో



ఆంధ్రా బాహుబలిగా...

యలమంచిలి పట్టణంలో మిస్టర్ ఆంధ్రా 27వ బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్-2023 పోటీలు జరిగాయి. 8లో

న్యూస్‌రీల్

ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘానికి నూతన కమిటీలు



మాట్లాడుతున్న విశాఖ ఉమ్మడి జిల్లాల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు

అనకాపల్లిటౌన్: ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం జిల్లాల నూతన కమిటీ నియామకం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం జరిగింది. సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడుగా మాసవరపు అప్పారావు, మండల అధ్యక్షునిగా పి.శ్రీనివాసరావు, గాజువాక పట్టణ అధ్యక్షునిగా డి.గణేష్, విశాఖ పశ్చిమ నియోజకవర్గం అధ్యక్షునిగా పి.అప్పలరాజులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు మెల్లేటి రమణబాబు, జాతీయ బీసీ ఫెడరేషన్ విశాఖ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు విల్లూరి పైడారావులు మాట్లాడుతూ సంఘం అధ్యక్షులను ముందుగా ఎన్నికోవడం జరిగిందని, వారంరోజుల్లో కమిటీ సభ్యుల ఎన్నిక జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పిల్లల శంకర్, కృష్ణంనాయుడు, సీహెచ్ జగ్గప్పారావు, సింహా శ్రీను, సాయి పాల్గొన్నారు.

గుంటూరులో ఆధునిక వ్యవసాయ సదస్సు

బుచ్చెయ్యపేట: గుంటూరు ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయంలో వచ్చే నెల 3 నుంచి 5వ తేదీ వరకు ఆధునిక వ్యవసాయ సదస్సు నిర్వహించనున్నట్లు కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధాన శాస్త్రవేత్త కె.రాజ్‌కుమార్ తెలిపారు. ఈ సదస్సులో రైతులకు శాస్త్రవేత్తలు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మెరుగైన యాజమాన్య పద్ధతులు, అధిక దిగుబడులపై అవగాహన కల్పిస్తారన్నారు. ఆసక్తి గల రైతులు ముందుగా కేవీకేలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నేవీ డేకు ఏర్పాట్లు షురూ..



నేవీ డే నిర్వహణకు బీచ్‌రోడ్డులో జరుగుతున్న ఏర్పాట్లు

బీచ్‌రోడ్డు: నౌకాదళ దినోత్సవం పురస్కరించుకుని తూర్పు నౌకాదళం ఆదివారం బీచ్‌రోడ్డులో ఏర్పాట్లు ప్రారంభించింది. నౌకాదళం శక్తి, సామర్థ్యాలు ప్రజలకు ప్రత్యక్షంగా చూపించడానికి వీలుగా ఏటా డిసెంబర్4న సముద్రంలో విన్యాసాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 28, 30వ తేదీల్లో రిహార్సల్స్, డిసెంబర్ 2న ఫైనల్ రిహార్సల్స్ చేయనున్నారు. డిసెంబరు 4న జరిగే ప్రధాన వేడుకకు నేవీ ఉన్నతాధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు హాజరవుతారు. ఈ వేడుకలను తిలకించేందుకు వేల సంఖ్యలో ప్రజలు సాగరతీరానికి చేరుకుంటారు. ఈ నేపథ్యంలో ఆర్.కె.బీచ్ నుంచి వైఎంసీఏ వరకు స్క్రీన్లు, సౌండ్ సిస్టమ్, గ్యాలరీలను సిద్ధం చేస్తున్నారు. విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా ప్రధాన వేదికను తీర్చిదిద్దుతున్నారు.

తంతడి తీరంలో విద్యార్థి గల్లంతు



రాజేష్ (ఫైల్)

పరవాడ: తంతడి తీరంలో సముద్ర స్నానానికి దిగిన ఓ విద్యార్థి గల్లంతయ్యాడు. గల్లంతైన విద్యార్థి పరవాడ బీసీ కాలనీకి చెందిన జంగాల రాజేష్ (14)గా గుర్తించారు. పరవాడ జెడ్పీ పాఠశాల్లో 9 తరగతి చదువుతున్నాడు. ఈ ఘటనకు సంబంధించి పరవాడ ఎస్ఐ మల్లేశ్వరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక జేఎన్ఎన్ యూఆర్ఎం కాలనీకి చెందిన పెయింటర్ వి.కల్యాణచక్రవర్తి, ఐటీఐ విద్యార్థి జనపరెడ్డి వినయ్, సీలింగ్ కార్మికుడు సమ్మంగి కిశోర్, పిన్నింటి మోక్షజ్ఞ స్నేహితులతో కలిసి విద్యార్థి రాజేష్ తంతడి తీరంలో సరదాగా గడపడానికి ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు వచ్చారు. 4.30 గంటల సమయంలో మోక్షాజ్ఞతో కలిసి రాజేష్ సముద్రంలో స్నానానికి దిగారు. స్నానం చేస్తుండగా ఉధృతంగా వచ్చిన అలల తాకిడికి వీరద్దరూ కొట్టుకుపోయారు. అక్కడే ఉన్న కల్యాణ చక్రవర్తి మోక్షజ్ఞను కాపాడగలిగాడు. రాజేష్‌ను అలలు సముంద్రంలోకి ఈడ్చుకుపోయాయి. గల్లంతైన రాజేష్ కోసం పోలీసులు గాలింపు చేపట్టినప్పటికీ ఫలితం దక్కలేదు. రాజేష్ గల్లంతైన విషయాన్ని తల్లిదండ్రులు సత్తిబాబు, సంతోషిలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఉన్న ఒక్కగాని ఒక్క కుమారుడు గల్లంతవడంతో కుటుంబంలో తీరని విషాదం చోటుచేసుకుంది. పరవాడ ఎస్ఐ మల్లేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంపూర్ణ పోషకాల గోరుముద్ద

గత ప్రభుత్వ హయాంలో మధ్యాహ్న భోజన పథకానికి 24 మండలాల్లో సుమారు రూ. 2 కోట్లు ఖర్చు చేయగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక జగనన్న గోరుముద్ద పథకం కింద రెట్టింపుగా రూ.4.70 కోట్లు ఖర్చు చేస్తోంది. అంతేకాకుండా పాఠశాల్లో ప్రత్యేక వైద్య అంబాసిడర్‌తో వైద్య సేవలు పర్యవేక్షణ చేపడుతోంది. గోరుముద్ద అమలుతో పిల్లల్లో జ్ఞాపకశక్తి, శారీరక ఎదుగుల, మానసిక ఆరోగ్యం పెరిగింది.

- పోషక భాండాగారంగా నిలుస్తున్న పథకం
- రక్తహీనతను తగ్గించేందుకు ఫోర్టిఫైడ్ రైస్‌తో భోజనం
- ప్రత్యేక మెనూ అమలుకు వంట సామాగ్రి సరఫరా
- సురక్షిత తాగునీటికి ఆర్‌వో ప్లాంట్లు



అర్జునగిరి ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

జిల్లాలో గోరుముద్ద అమలు ఇలా..

పాఠశాలలు (ఎంపీపీ, యూపి, ఉన్నత పాఠశాలు) **1424**

కేటాయించిన నిధులు నెలకు : రూ.**4.70** కోట్లు

ప్రతిరోజు పోషకాహారం అందిస్తున్న విద్యార్థుల సంఖ్య **1,07,615**



పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు

చీడికాడ: ఆరోగ్యమే మహాభాగ్యం, నేటి బాలలే రేపటి పౌరులు.. అనే ఆర్యోక్తిని తీసుకుని భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండాలనే ఆకాంక్షతో, దార్శనికతతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద నిరుపేద, మధ్య తరగతి, వలస కూలీల పిల్లలపాలిట వరంగా మారింది. ఈ పథకం పిల్లలకు పోషక భాండాగారంగా నిలిచింది. అనకాపల్లి జిల్లాలో గల 1,043 ఎంపీపీ పాఠశాలలు-27766 మంది విద్యార్థులు, 156 యూపి-11901 మంది, 225 ఉన్నత పాఠశాలల్లో గల-67948 మంది విద్యార్థులు మొత్తంగా 1,07,615 లక్షల మంది విద్యార్థులకు జగనన్న గోరుముద్ద అందిస్తున్నారు. మొత్తం 1424 పాఠశాలల్లో అమలు జరుగుతుంది.

ఆరు రోజులు.. ఆరు రకాల మెనూ

జగనన్న గోరుముద్దలో ఆరురోజుల పాటు ఆరు రకాల మెనూ వండిపెడుతున్నారు. సోమవారం నుంచి శనివారం వరకు కూరగాయలతో రోజుకో రకం కిచిడీ, అదనంగా ప్రతిరోజు గుడ్డుతో పాటు 3 రోజులు చిక్కిలు, రాగి అంబలి ఇస్తున్నారు.

ఫోర్టిఫైడ్ రైస్‌తో భోజనం

గోరుముద్దలో భాగంగా ఫోర్టిఫైడ్ రైస్‌తో భోజనం పిల్లలకు అందిస్తున్నారు. ఈ ఫోర్టిఫైడ్ రైస్‌లో పిల్లల్లో జ్ఞాపకశక్తి, శారీరక ఎదుగుల, మానసిక ఆరోగ్యాన్ని పెంచడంతో పాటు రక్తహీనతను తగ్గించి, హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచే విటమిన్లు, ఐరన్, ఫోలిక్ యాసిడ్ మెండుగా ఉంటాయి.

ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

విద్యార్థులకు పాఠశాలలో అందించే వైద్య సేవలపై ఒక టీచర్‌ను వైద్య అంబాసిడర్‌గా నియమించారు. గోరుముద్ద అమలు, విద్యార్థినుల సామాజిక సమస్యలు, సమాజంలో మెలిగే విధానం మంచి, చెడులను సూచించేందుకు సచివాలయ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించి పర్యవేక్షిస్తున్నారు. నెలలో రెండు, మూడు దఫాలు బాలికలు, బాలుర ఆరోగ్యస్థితిపై వైద్యపరీక్షలు నిర్వహించి రక్తహీనతతో బాధపడే కౌమారదశ బాలికలకు నాణ్యమైన మందులను దగ్గరుండి వేయిస్తున్నారు.

సిబ్బంది వేతనాల పెంపు

మెనూ అమలుకు ప్రత్యేకించి ప్రతి పాఠశాలకు ప్రభుత్వం వంటసామాగ్రిని అందించింది. నిర్వాహకులకు గత ప్రభుత్వ హయాంలో నెలకు వెయ్యి రూపాయలు ఉన్న వేతనాలను రూ.3వేలకు పెంచింది. పాఠశాల పరిశుభ్రత కోసం ఆయాను నియమించి రూ.6వేలు వేతనం అందిస్తూ నిరంతరం విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

రుచికరమైన భోజనం



ఎంతో రుచికరమైన భోజనం పాఠశాలలో అందిస్తున్నారు. మా జగన్ మామ ప్రభుత్వం మా చదువుకోసం అమ్మ ఒడి పథకం ద్వారా డబ్బులిస్తూ ఆదుకుంటున్నది. స్కూల్లో బాలికలకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు నిర్మించారు. -ఉప్పిలి వాణి, విద్యార్థిని, చుక్కపల్లి హైస్కూలు

మా పిల్లలకు వరం..



జగనన్న గోరుముద్ద మా లాంటి వలస కూలీల పిల్లల పాలిట వరంగా మారింది. మేం బతుకుతెరువుకు ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో మా పిల్లలను మా తల్లిదండ్రులు వద్ద విడిచి వెళుతున్నాం. వారికి గతంలో సరైన భోజనం అందేది కాదు. ఇపుడు విద్య, మంచి పోషకాహారం అందుతుంది.

-గ్రంటేడ్డి అచ్చింనాయుడు, అర్జునగిరి

ఎనిమిక్ ఫ్రీ జిల్లాగా నిలిపేందుకు కృషి



ప్రతి రోజు మెనూ అమలు తీరును పర్యవేక్షిస్తున్నాం. జగనన్న గోరుముద్ద అమలు తరువాత డ్రాపౌట్స్ తగ్గాయి. ప్రత్యేకించి పిల్లల్లో హెచ్‌బీ స్థాయిలు పెరిగేందుకు గోరుముద్ద ఎంతో ఉపకరిస్తుంది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎనిమిక్ ఫ్రీ జిల్లాగా అనకాపల్లిని నిలిపేందుకు కృషి చేస్తున్నాం. -ఎం.వెంకటలక్ష్మమ్మ, డీఈఓ

నమో నారసింహ

ఘనంగా శ్రీ నృసింహ దీక్షలు ప్రారంభం



దీక్ష తీసుకునేందుకు చందనం రంగు వస్త్రాలు ధరించి వచ్చిన భక్తులు

సింహాచలం: శ్రీ నృసింహ దీక్షలు ఆదివారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. 41 రోజుల మండల దీక్ష తీసుకునేందుకు వచ్చిన సుమారు 350 మంది దీక్షాధారులకు సింహగిరిపై దేవస్థానం వైదిక, అధికార వర్గాలు శాస్త్రోక్తంగా మాలధారణ చేశారు. సింహగిరిపై రాజగోపురం పక్కన మాడవీధిలో ప్రత్యేకంగా వేదిక ఏర్పాటు చేసి శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ప్రతిమలను ఉంచారు. దేవస్థానం అర్చకులు, అధికారులు మేళతాళాలు, వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆలయం నుంచి తులసి మాలలను ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకొచ్చారు. స్వామి చెంతన తులసి మాలలను ఉంచి అర్చకులు విష్వక్సేన పూజ పుణ్యాహవాచనం నిర్వహించారు. స్వామి అష్టోత్తర శతనామావళిని దీక్షాధారులతో పఠింపజేశారు. అనంతరం వారికి మాలధారణ చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ దీక్ష నియమాలను వివరించారు. దేవస్థానం తరపున ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి దీక్ష వస్త్రాలు, క్షేత్ర పురాణం కరపత్రాలను అందజేశారు. దీక్ష తీసుకున్నవారిలో సింహాచలం ప్రాంతానికి చందన పెరుమాళ్ పీఠం గురుస్వామి సానబోయిన రాజుతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలు, ఒడిశా, హైదరాబాద్, విశాఖ ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన భక్తులు ఉన్నారు. దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, దొడ్డి రమణ, రాజేశ్వరి, డిప్యూటీ ఈవో సుజాత, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవోలు నరసింహరాజు, రమణ మూర్తి, పాలూరి నరసింగరావు, పీఆర్వో నాయుడు, సింహాద్రి మఠం గురుస్వామి కె.సురేంద్రస్వామి పాల్గొన్నారు. కాగా చందన పెరుమాళ్ పీఠం దీక్షాధారులు వరాహ, నృసింహ వేషధారణాల్లో అలరించారు. డిసెంబర్ 4 నుంచి 32 రోజుల నృసింహ దీక్షలు ప్రారంభమవుతాయని స్థానాచార్యులు తెలిపారు.

రాజ్యాంగ స్ఫూర్తితో సీఎం జగన్ పాలన

- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు
- తారువ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం
- డా.అంబేడ్కర్‌కు ఘన నివాళులు



తారువలో డా.బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి



ఎస్పీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఎస్పీ సత్యనారాయణరావు

దేవరాపల్లి: రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి రాజ్యాంగబద్ధ పాలన సాగిస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. తారువ క్యాంప్ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. డా. బిఆర్. అంబేడ్కర్ చిత్రపటానికి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారికి సైతం అన్ని పదవుల్లో సమాన అవకాశాలు కల్పించి సీఎం జగన్ సామాజిక న్యాయం పాటిస్తున్నారన్నారు. ప్రజల చెంతకే ప్రభుత్వ పాలనను, రాజ్యాంగ ఫలాలను అందరికీ అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని గౌరవిస్తూ దేశ ప్రగతికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. యలమంచిలి మున్సిపల్ చైర్మన్ పిల్లా రమాకుమారి, విశాఖ డెయిరీ డైరెక్టర్లు శీరంరెడ్డి సూర్యనారాయణ, సత్యనారాయణ,గంగాధర్, జేసీఎస్ మండల కన్వీనర్ రమణ, చీడికాడ మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రాజుబాబు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

తుమ్మపాల: రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరూ గౌరవం, విధేయత కలిగి ఉండాలని డీఆర్వో బి.దయానిధి అన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం 74వ భారతరాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించి మాట్లాడారు. ప్రజల సంక్షేమం, దేశాభివృద్ధి, హక్కులు, బాధ్యతలతో రచించిన రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26న జాతికి అంకితం చేశారని, ఇదే రోజున జాతీయ న్యాయ దినోత్సవం జరుపుకొంటున్నామని చెప్పారు. పరిపాలన అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లౌకికవాదమే పునాదిగా.. : ఏఎస్పీ

అనకాపల్లిటౌన్: నేటికి భారత రాజ్యాంగం అమలై 74 వసంతాలు పూర్తయిందని అదనపు ఎస్పీ పి.సత్యనారాయణరావు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లౌకికవాదమే పునాదిగా రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవిస్తామని పోలీసు అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్‌బీ ఎస్ఐ బి.అంజిబాబు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మాకవరపాలెం వామలింగేశ్వర ఆలయంలో ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేస్తున్న మహిళలు

• కార్తీక వైభవం

కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆదివారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి ఉపవాసం ఉన్న భక్తులు సాయంత్రం ధ్వజస్తంభాల వద్ద దీపారాధన చేశారు. అలాగే ఆలయాల్లో జ్వాలాతోరణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు.



అనకాపల్లి సిద్ధిలింగేశ్వరస్వామి ఆలయంలో జ్వాలాతోరణం

వెదుళ్ల సంబరానికి వేళాయె...

- రేపు దిమిలిలో దల్లమాంబ జాతర
- ప్రత్యేకత చాటనున్న వెదుళ్ల ఉత్సవం
- భారీగా తరలిరానున్న భక్తజనం



దిమిలిలో దల్లమాంబ అమ్మవారు



వెదుళ్ల ఉత్సవం దృశ్యం(ఫైల్ ఫోటో)

రాంబిల్లి: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన దిమిలి దల్లమాంబ జాతర మంగళవారం జరగనుంది. ఈ జాతరలో వెదుళ్ల ఉత్సవం ప్రత్యేకత చాటనుంది. భక్తుల కొంగు బంగారంగా పేరొందిన దల్లమాంబ జాతరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు సర్పంచ్ బంగారు చిలుకు, ఉప సర్పంచ్ నగిరెడ్డి మురళీకృష్ణ తెలిపారు. ఈ దల్లమాంబ జాతర, వెదుళ్ల సంబరం చూసేందుకు ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల్లో స్థిరపడిన భక్త జనం భారీగా దిమిలికి తరలివస్తుంది.

చారిత్రక నేపథ్యం

దిమిలిలో దల్లమాంబ అమ్మవారి జాతరకు చారిత్రక నేపథ్యం ఉంది. పూర్వం మరాఠి ముఠా గుర్రాలపై వచ్చి గ్రామాలపై దాడులు చేస్తూ దౌర్జన్యాలకు పాల్పడేది. ఆ క్రమంలో ఓ బ్రాహ్మణ యువతి దల్లమాంబ శారదనది ఒడ్డున స్నేహితురాళ్లతో ఆడుకుంటుండగా గుర్రాలపై మరాఠి దండు రావడం గమనించింది. వారి చేతికి చిక్కడం ఇష్టం లేని దల్లమాంబ శారద నదిలో దూకి ప్రాణత్యాగం చేసింది. దీంతో గ్రామస్తుల్లో చైతన్యం వచ్చింది. ధైర్యంగా వెదుళ్లు చేతబూని మరాఠి దండుపై ఎదురుదాడికి దిగారు. దీంతో అప్పటి నుంచి వారి ఆగడాలు ఆగిపోయాయని చరిత్ర చెబుతుంది. కొన్నాళ్లకు అమ్మవారు స్థానిక రైతుకు స్వప్నంలో కనిపించి తనకు గుడి కట్టించి పూజలు చేయాలని చెప్పడంతో స్థానికులు ఆలయం కట్టించి పూజలు చేయడం ప్రారంభించారు. తొలుత ఇక్కడ రాతి విగ్రహం ఉండేది. తర్వాత భారీ విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ చారిత్రిక నేపథ్యంలో రెండేళ్లకోసారి నిర్వహించే దల్లమాంబ జాతరలో వెదుళ్ల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. గుంపులు గుంపులుగా వెదుళ్ల చేతబూని కొందరు కూర్చోగా చుట్టూ వెదళ్లతో కూర్చొన్న వారి వెదుళ్ల గుంపుపై కొడతుంటారు. వెదుళ్ల ఉత్సవంలో పాల్గొన్నప్పటికీ గాయాలు కాకపోవడం అమ్మవారి మహాత్మ్యంగా భక్తులు చెబుతారు. వెదుళ్ల సంబరంలో పాల్గొన్ని ఆయా వెదురును ఇంటి వద్ద వుంచితే మళ్లీ దల్లమాంబ జాతర వచ్చే వరకు సకల శుభాలు కలుగుతాయని నమ్ముతారు.

జాతరకు ఘనంగా ఏర్పాట్లు

దల్లమాంబ జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం రాత్రికి శారద నది ఒడ్డున భారీగా బాణసంచా వెలిగిస్తారు. ఈ సందర్భంగా ఆలయం సహా గ్రామంలో విద్యుద్దీపాలంకరణ చేశారు. చిడతలు, తప్పెటగుళ్ల, నేల వేషాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

భారీ బందోబస్తు

జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నియంత్రించేందుకు సీఐ గఫూర్ పర్యవేక్షణలో రాంబిల్లి ఎస్ఐ దీనబంధు ఆధ్వర్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆశాకిరణం లాంగ్‌లైనర్

- సాధారణ మత్స్యకారులకు 50 శాతం రాయితీ
- బోటు ప్రమాద బాధితులకు ప్రభుత్వం 75 శాతం సబ్సిడీ



లాంగ్‌లైనర్ బోటు

సాక్షి, విశాఖపట్నం: మత్స్యకారులకు ఆదాయాన్ని తెచ్చి పెట్టే బోట్లలో లాంగ్‌లైనర్లు పెట్టింది పేరు. సాధారణ చేపల వేటకు మెకనైజ్డ్ (మర) బోట్లను వినియోగిస్తారు. వీటి ద్వారా చేపలతో పాటు రొయ్యల వేట సాగిస్తారు. ఇలాంటి మెకనైజ్డ్ బోట్లు విశాఖలో 690 వరకు ఉన్నాయి. ఇవి కాకుండా మరో 150 వరకు లాంగ్‌లైనర్ బోట్లున్నాయి. ట్యూనా వంటి పెద్ద చేపల వేట కోసం వీటిని ఉపయోగిస్తారు. మెకనైజ్డ్ బోట్లు సముద్రంలో వలలు వేసి చేపలు, రొయ్యలను, హుక్ (గాలం)ల ద్వారా ట్యూనా చేపలను వేటాడతారు. మెకనైజ్డ్ బోటు ఖరీదు రూ.30 నుంచి 60 లక్షల వరకు ఉంటే.. లాంగ్‌లైనర్ బోటు ఖరీదు రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంటుంది. వీటిలో ఫైబర్‌తో తయారైనది రూ.80 లక్షలు, స్టీల్‌తో తయారు చేసినది రూ.కోటి అవుతుంది. విశాఖ ప్రాంతానికి స్టీల్ లాంగ్‌లైనర్ బోట్లు అనుకూలంగా లేకపోవడంతో ఫైబర్ బోట్లకే మత్స్యకారులు మొగ్గు చూపుతున్నారు. గత ఆదివారం విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో సంభవించిన అగ్ని ప్రమాదంలో 49 మెకనైజ్డ్ బోట్లు దగ్ధమయ్యాయి. వీటిలో 30 పూర్తిగా, 19 బోట్లు పాక్షికంగా కాలిపోయాయి. స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రమాదం జరిగిన మూడు రోజుల్లోనే బోట్లకు వాటిల్లిన నష్టంలో 80 శాతం పరిహారంగా రూ.7.11 కోట్లను సంబంధిత బోటు యజమానులకు చెల్లించింది. ఇలా గరిష్టంగా రూ.32.80 లక్షలు, కనిష్టంగా రూ.2.40 లక్షలు బాధితులకు పంపిణీ చేసింది.

లాంగ్‌లైనర్‌ల కొనుగోలుకు చేయూత

లాంగ్‌లైనర్ బోట్ల కొనుగోలుకు ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై), బ్లూ రివల్యూషన్ పథకాల్లో పురుష మత్స్యకారులకు 50 శాతం, మహిళా మత్స్యకారులకు 60 శాతం వరకు సబ్సిడీగా చెల్లిస్తోంది. వీటిలో రాష్ట్ర ప్రభుత్వ వాటా 12 శాతం ఉంది. మిగిలిన సొమ్మును బ్యాంకులు రుణంగా ఇస్తాయి. కొంత సొమ్మును లబ్ధిదారుని వాటాగా సమకూర్చుకోవలసి ఉంటుంది. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన మెకనైజ్డ్ బోట్ల యజమానులు ఈ లాంగ్‌లైనర్ బోట్లు కొనుగోలుకు ముందుకు వస్తే వాటికి 75 శాతం సబ్సిడీ చెల్లించేలా త్వరలో జీవో జారీ చేయనున్నట్టు మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు వారికి పరిహారం పంపిణీ చేసే కార్యక్రమంలో ప్రకటించారు. విశాఖ వాతావరణానికి స్టీల్ లాంగ్ లైనర్‌లు అనుకూలం కాదన్న భావన మత్స్యకారుల్లో ఉంది. దీంతో ఫైబర్ బోట్లను కొనుగోలు చేసే వారికి రూ.60 లక్షల వరకు సబ్సిడీ దక్కనుంది. మిగిలిన సొమ్ములో కొంత బ్యాంకులు రుణం ఇస్తాయి. లబ్ధిదారుని వాటాగా బోట్ల పరిహారంగా ఇచ్చిన సొమ్ములో అవసరమైన మేరకు చెల్లిస్తే సరిపోతుంది. సరికొత్త బోటు మత్స్యకారుని సొంతమవుతుంది.

ప్రయోజనాలివీ..

ఆదాయాన్ని తెచ్చిపెట్టే లాంగ్‌లైనర్లపై కొన్నాళ్లుగా మత్స్యకారుల్లో ఆసక్తి ఉంది. ఈ బోట్లతో డీప్ సీలో హుక్‌ల ద్వారా వేట సాగిస్తారు. వేటాడిన చేపలు రోజుల తరబడి నిల్వ ఉండేందుకు బోట్లలో ఐదారు టన్నుల ఐస్‌ను తీసుకెళ్తారు. లాంగ్‌లైనర్లలో నీటిని 1-2 డిగ్రీల శీతలీకరణ చేసే సాంకేతికత ఉంటుంది. గడ్డకట్టే ఆ నీటిలో చేపలను నిల్వ ఉంచుకోవచ్చు. అందువల్ల ఇక ఐస్ అవసరం ఉండదు. ట్యూనాలు వంటి ఖరీదైన చేపల పొట్ట భాగాన్ని తొలగించి వాటిలో ఉంచడం ద్వారా సెస్మీగ్రేడ్ ఫిష్‌గా తయారవుతుంది. వీటికి విదేశాల్లో డిమాండ్ ఎక్కువగా ఉండడం వల్ల మంచి ధర పలుకుతుంది. మెకనైజ్డ్ బోట్లకంటే లాంగ్ లైనర్‌లకు డీజిల్ వినియోగం తక్కువ. ఇవన్నీ బోటు యజమానికి లాభదాయకమవుతాయి. ప్రస్తుతం విశాఖ నుంచి వేటకు వెళ్లే లాంగ్‌లైనర్ బోట్లకు ఈ సదుపాయం లేదు. కొత్తగా కొనుగోలు చేసే వాటికి శీతలీకరణ సదుపాయం ఉంటుంది. ఇటీవల లాంగ్‌లైనర్ బోట్ల తయారీపై చెన్నైకి చెందిన సంస్థ ప్రతినిధులతో చర్చించామని, రూ.80 లక్షలకు ఫైబర్ బోటు ఇవ్వడానికి ముందుకొచ్చారని, దీనిపై మత్స్యశాఖ ఉన్నతాధికారులకు నివేదించామని జిల్లా మత్స్యశాఖ అధికారి జి.విజయ 'సాక్షి'కి చెప్పారు.

క్లుప్తంగా

దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి బదిలీ


వైద్యాధికారి లలిత

దేవరాపల్లి: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్. లలితను ఉన్నతాధికారులు ఆకస్మికంగా బదిలీ చేశారు. విధి నిర్వహణలో వేధింపులకు గురి చేస్తున్నారని ఇక్కడ వైద్య సిబ్బందితోపాటు సీపీఎం నాయకుడు డి. వెంకన్న రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టరు బి.రామ్‌రెడ్డికి ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఇటీవల స్థానిక పీహెచ్‌సీలో ప్రాథమిక విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలోనే విచారణ నివేదిక ఆధారంగా క్రమశిక్షణ చర్యలలో భాగంగా వైద్యాధికారి లలితను తూర్పుగోదావరి జిల్లా అన్నదేవరపేట పీహెచ్‌సీకి బదిలీ చేసినట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడి మృతి



అనకాపల్లి టౌన్: స్థానిక విజయరామరాజుపేట రైల్వే బ్రిడ్జి సమీపంలో యలమంచిలి నుంచి విశాఖ వైపు వెళ్తున్న గుర్తు తెలియని రైలు ఢీకొని వృద్ధుడు ఆదివారం మృతి చెందాడు. అటుగా వెళ్తున్న గ్యాంగ్‌మన్ గుర్తించి అనకాపల్లి స్టేషన్ మేనేజర్‌కు సమాచారం ఇచ్చాడు. దువ్వాడ జీఆర్పీ ఎస్‌ఐ శాంతారామ్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడి సంబంధికులు 7673906010 సంప్రదించాలన్నారు.

బొర్రాకు పర్యాటకుల తాకిడి


పర్యాటకులతో కళకళలాడుతున్న సరియా జలపాతం

అనంతగిరి: బొర్రాగుహలకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. గుహలను 4500 మంది తిలకించగా, రూ.3.75 లక్షల ఆదాయం వచ్చినట్టు మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు. సరియా, తాటిగూడ, చిట్టంపాడు, కటికి జలపాతాలు వద్ద పర్యాటకులు సందడి చేశారు.

సరుగుడులో కోలాహలం

- పర్యాటకుల తాకిడితో సందడి
- ఏటా కార్తీకమాసంలో సందర్శన


జలపాతం పక్కనే పార్వతీపరమేశ్వరుల విగ్రహాలు


ఎత్తయిన కొండ నుంచి వస్తున్న నీటిని తిలకిస్తున్న సందర్శకులు

నాతవరం: కనుచూపు మేర దట్టమైన పచ్చని చెట్లు.. ఎత్తయిన కొండల మధ్యలోంచి జలజల జాలువారే నీటి ప్రవాహం.. మండు వేసవిలో సైతం చల్లటి వాతావరణం పంచే సరుగుడు జలపాత ప్రాంతం పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తోంది. ఇక్కడ వారాంతపు సెలవు రోజుల్లో అనేక మంది ఉల్లాసంగా ఉత్సాహంగా గడపడానికి ఆసక్తి చూపిస్తుంటారు. రెండు కొండల మధ్య 50 అడుగులు ఎత్తులోంచి నీటి ప్రవాహంలో జలకాలాట ఆడేందుకు ఇష్టపడుతుంటారు. మండలంలో ఏజెన్సీ గ్రామమైన సరుగుడు సమీపంలో ఈ ప్రాంతం వన సమారాధనకు నిలయంగా మారింది. ప్రస్తుతం కార్తీకమాసం ప్రారంభం నుంచి ఉమ్మడి విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల నలుమూలల నుంచి పెద్ద ఎత్తున సందర్శకులు వస్తుండటంతో ఈ ప్రాంతమంతా కోలాహలం నెలకొంటోంది.

రూ.10 లక్షలతో మౌలిక వసతుల కల్పన....

ఇటీవల ఈ ప్రాంతాన్ని పర్యాటక శాఖాధికారులు రూ.10 లక్షలతో తీర్చిదిద్దారు. సందర్శకులకు అవసరమయ్యే పలు మౌలిక వసతులు కల్పించారు. ఇక్కడ జలపాతంలో స్నానమాచరించే వారు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా ప్రత్యేకంగా గదులు నిర్మించారు. కొండలపై నుంచి జాలు వారే జలపాతం వద్దకు వెళ్లేందుకు ప్రత్యేకంగా మెట్లతోపాటు ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. అధికంగా ఎండ కాచినా వర్షం పడినా తలదాచుకునేందుకు షెడ్లు నిర్మించారు. జలపాతం దిగువ ప్రాంతంలో కొండపై వినాయకుడు, పార్వతీపరమేశ్వరులు, పక్కనే నంది విగ్రహాలతోపాటు శివ లింగం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో కార్తీక మాసంలో భక్తులు జలపాతంలో స్నానమాచరించి వీటిని దర్శించుకుని పూజలు చేస్తుంటారు. ప్రధాన జలపాతం వద్ద కొండ గుహలో పూర్వం నుంచి గంగాలమ్మను పూజిస్తుంటారు. అమ్మవారిని దర్శించుకుంటే, తాము తలపెట్టిన ఏ పనీ అయిన అవలీలగా పూర్తవుతుందని ఈ ప్రాంత గిరిజనుల నమ్మకం. ఇక్కడకు నేరుగా చేరుకునేందుకు ఇటీవల కొత్తగా తారురోడ్డు వేశారు. నర్సీపట్నం నుంచి 35 కిలోమీటర్ల మేర దూరం ఉంటోంది. ఉదయం, సాయంత్రం సరుగుడు వరకు నిత్యం ఆటోలు తిరుగుతుంటాయి.


జలపాతానికి వెళ్లేందుకు నూతనంగా వేసిన రోడ్డు


పర్యాటక శాఖ సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన షెడ్డు

ఆంధ్రా బాహుబలిగా భాస్కరరావు

- ఏపీ బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ


టైటిల్ అందుకుంటున్న విశాఖ బాడీ బిల్డర్ గిడ్డి భాస్కరరావు

యలమంచిలి(అనకాపల్లి రూరల్): కొండల్ని పిండి చేసే కండలు, ఒంపులు తిరిగిన శరీర సౌష్టవం, ఒకర్ని మించి మరొకరి ప్రదర్శన.. బాడీ బిల్డింగా.. మజాకానా అన్నట్లుగా మిస్టర్ ఆంధ్రా 27వ బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్–2023 పోటీలు జరిగాయి. ఇందులో విజేతగా విశాఖపట్నానికి చెందిన బాడీ బిల్డర్ గిడ్డి భాస్కరరావు నిలిచాడు. స్థానిక పంచముఖి హనుమాన్ ఫిట్‌నెస్ జిమ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి యలమంచిలి పట్టణంలో ఈ పోటీలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి 97 మంది బాడీ బిల్డర్లు పోటీల్లో పాల్గొని తమ శరీర సౌష్టవాన్ని ప్రదర్శించారు. వివిధ విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చూపారు. పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి యువకులు పోటీలను చూసేందుకు ఆసక్తి చూపారు. పలువురు తమ మొబైల్ ఫోన్లలో పోటీల వీడియోలు, ఫొటోలు తీసేందుకు పోటీపడ్డారు. అంతకుముందు ఈ పోటీలను యలమంచిలి సీఐ షేక్ గఫూర్, చార్టెర్డ్ అకౌంటెంట్ బండారు సత్య బంగారుశెట్టి ప్రారంభించారు. ఇలాంటివి యువకుల్లో పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఆడారి ఎస్వీఎస్ నాయుడు, కరణం శేఖర్, యల్లపు భాస్కర్, ఆడారి రమణబాబు, ఆడారి ఆదిమూర్తి, రవితేజ, నూకేష్ పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్


డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడిని సత్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి

దేవరాపల్లి: మండలంలోని తారువ క్యాంప్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడిని యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమా కుమారి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం తారువలో విశాఖ డెయిరీ సహకారంతో నిర్మిస్తున్న ఓపెన్ ఆడిటోరియాన్ని పరిశీలించారు. పలు అంశాలపై చర్చించారు. విశాఖ డెయిరీ డైరెక్టర్లు శీరంరెడ్డి సూర్యనారాయణ, గేదెల సత్యనారాయణ, సుందరపు గంగాధర్ పాల్గొన్నారు.

సామాజిక సాధికార బస్సు యాత్రకు సిద్ధం కావాలి

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ


పార్టీ ముఖ్య నాయకులతో మాట్లాడుతున్న ధర్మశ్రీ

రావికమతం: వచ్చే నెలలో చోడవరం నియోజకవర్గంలో సామాజిక సాధికార బస్సు యాత్ర మూడో విడత జరగనుందని, ఇందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంసిద్ధులు కావాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. ఆదివారం రావికమతం వచ్చిన ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేకూరిన లబ్ధిని వివరించేందుకు అక్టోబరు 26 ప్రారంభించిన ఈ యాత్ర రెండు విడతల్లో దిగ్విజయంగా కొనసాగిందన్నారు. మూడో విడతగా వచ్చే నెలలో చోడవరంలో నిర్వహించేందుకు ఉత్తరాంధ్ర పార్టీ ఇన్‌చార్జి వై.వి.సుబ్బారెడ్డి సూచనప్రాయంగా తెలియజేశారన్నారు. ఏ క్షణంలో జరిగినా శతశాతం విజయవంతానికి అంతా సంసిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు పాల్గొన్నారు.

42 ఏళ్లకు 'నాక్' గుర్తింపు మదింపు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాధాకృష్ణ

చోడవరం రూరల్: కళాశాల స్థాపించిన 42 ఏళ్లకు ప్రతిష్టాత్మకమైన నాక్ గుర్తింపునకు మదింపు జరుగుతుందని, కళాశాల పూర్వ విద్యార్థులు తమ వంతు సలహాలు, సూచనలు అందించాలని ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ కోరారు. ఆదివారం చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆల్మనీ (పూర్వ విద్యార్థుల సమ్మేళనం) సమావేశం జరిగింది. కళాశాల గోల్డెన్ జూబ్లీ నిర్వహించుకోవడానికి సమీపంలోకి వచ్చామని, అదే సమయానికి నాక్ గుర్తింపు సాధించుకుంటే కళాశాలకు, విద్యార్థులకు చక్కని అవకాశాలు ఉంటాయన్నారు. వచ్చే నెల 12, 13 తేదీల్లో నాక్ అసెస్మెంట్ కమిటీ కళాశాలను సందర్శించనుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సమయంలో పూర్వ విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. ఆల్మనీ కోఆర్డినేటర్ జి.నారాయణమూర్తి, పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్ గౌరీశంకర్, ఎ.వి.రమేష్ తమ సహకారం ఎల్లవేళలా అందిస్తామని హామీ ఇచ్చారు. వైస్ ప్రిన్సిపాల్ వి.కిరణ్‌కుమార్, సీనియర్ ఉపన్యాసకులు సుధీర్, డి.మాల్యాద్రి, సూపరింటెండెంట్ శర్మ, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

నర్సీపట్నం: పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికతో ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. ఇక్కడ 1980–81లో విద్యనభ్యసించిన వారంతా వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. 42 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత వీరంతా ఒక చోటకు చేరారు. ఆప్యాయంగా ఒకరిని ఒకరు పలకరించుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి దశలో మధురస్మృతులను నెమరువేసుకున్నారు. అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు శాస్త్రి, జగన్నాథరావు, కె.ఎస్.మూర్తి, బి.ఎ.ఎస్.మూర్తి, బంగారు పాప, ఇందిరాదేవిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమ నిర్వాహకులుగా పూర్వ విద్యార్థులు సత్యానందం, పెదపాటి గోవిందరావు, కన్నయ్యశెట్టి, శివశంకర్ వ్యవహరించారు.

జూకు కార్తీక శోభ


జూలో పాములు చూస్తున్న సందర్శకులు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో ఆదివారం సందడి నెలకొంది. కార్తీక మాసం రెండో ఆదివారం కావడంతో ఆరు వేలకు పైగా జూను సందర్శించారు. పిల్లలు, పెద్దలు, పలు పాఠశాలల విద్యార్థులతో వన్యప్రాణుల ఎన్‌క్లోజర్ల వద్ద గుంపులుగా కనపించారు. ఏనుగులు, కోతులు, మొసళ్లు, పాములు, చింపాంజీలు, పులులు, సింహాలు, అడవి కుక్కలు, హైనాలు, నెమళ్లు, నిప్పుకోళ్లు, ఈములు సందర్శకులను అలరించాయి. మేటింగ్ కోసం ఎన్‌క్లోజర్‌లో విడిచిపెట్టిన జత సింహాలు హుషారుగా ఒక దాని వెంట మరొకటి పరుగెడుతూ సందర్శకులను కనువిందు చేశాయి. నీటి ఏనుగులు వాటి కొలనులో ఆడుకుంటూ అలరించాయి. ఇటీవల ఏర్పాటు చేసిన ఆట పరికరాలు వద్ద పిల్లలు ఎక్కువ సేపు ఆడుకుంటూ గడిపారు. జూను ఆదివారం 6,354 మంది సందర్శించారని, వారి ద్వారా రూ.5.30లక్షల ఆదాయం లభించినట్లు క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. కంబాలకొండ ఎకో టూరిజం పార్కును 550 మంది సందర్శించగా.. రూ.35,000 ఆదాయం లభించిందని సిబ్బంది వెల్లడించారు.


జూలో ఏనుగులు


జూలో సింహాలు

వడ్డాదిలో రెండు పూరిళ్లు దగ్ధం

రూ.4 లక్షల ఆస్తినష్టం


బాధితులను పరామర్శిస్తున్న నాయకులు

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది మోదకొండమ్మ ఆలయం సమీపంలో ఆదివారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన గరికిపాటి కొండమ్మ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఎగసిపడి పక్కనే పరిమల దేముడమ్మ ఇల్లు కాలి బూడిదైంది. రెండిళ్లలో తిండిగింజలు, దుస్తులు, వస్తువులు, నగదు కాలిపోవడంతో కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. ఈ ప్రమాదంలో రూ.4 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోతున్నారు. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి సూరి అప్పారావు, ఎంపీటీసీలు కోరుకొండ లీలావతి రమణ, ఇంటి అప్పారావు పరామర్శించారు. జెడ్పీటీసీ తనవంతు సాయంగా 50 కేజీలు బియ్యం అందించారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ పరంగా పరిహారం అందించి ఆదుకుంటామని తెలిపారు.

అక్రమంగా పశుమాంస విక్రయాలు

- 11 మందిపై కేసు నమోదు
- 15 గోవులు గో సంరక్షణశాలకు తరలింపు


స్వాధీనం చేసుకున్న గోవులు

పాయకరావుపేట: పట్టణంలో గల ఆర్టీసీ బస్సుస్టాండ్ సమీపాన, నాగరాజుపేట రైల్వే గేటు సమీపాన, మాంసం షాపుల దగ్గరలో అక్రమంగా పశువుల మాంసం అమ్ముతున్న 11 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఎస్.రమేష్ తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున తమకు అందిన సమాచారం మేరకు గ్రామ వీఆర్వీ, సిబ్బందితో తనిఖీ చేయగా పశువులను కోసి మాంసం అమ్ముతూ పట్టుబడ్డారన్నారు. నిందితులను అదుపులోనికి తీసుకుని, కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా పశు మాంసం అమ్మకాలకు, కోతకు సిద్ధంగా వుంచిన 15 గోవులను కూడా స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. స్వాధీనం చేసుకున్న గోవులను గోసంరక్షణ శాలకు పంపించడం జరిగిందని ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

ముగిసిన స్వాభిమాన ఉత్సవాలు



కవర్‌ను ఆవిష్కరిస్తున్న కల్నల్ రాములు, డైరెక్టర్ రవీంద్రబాబు

కొమ్మాది: రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధనా శిక్షణా మిషన్ భవన్‌లో నిర్వహిస్తున్న గిరిజన స్వాభిమాన ఉత్సవాలు (జన జాతీయ గౌరవ్ దివస్) ఆదివారం ఘనంగా ముగిశాయి. రాష్ట్రం వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వచ్చిన గిరిజన కళాకారుల తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ముగింపు సందర్భంగా రాష్ట్ర స్థాయి వాలీబాల్, ఆర్చరీ, జవెలన్ త్రో, చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాసాల్లో పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మిషన్ డైరెక్టర్ రవీంద్రబాబు, కల్నల్ వి.రాములు బహుమతులు అందజేశారు. గిరిజన స్వతంత్ర వీరుడు గామ్ గంటందొర, వీరయ్య దొర గౌరవార్థం ప్రత్యేక కవర్లను ఆవిష్కరించారు. అనంతరం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.చినబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాబ్ మేళా రేపు

అనకాపల్లిటౌన్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి సాయి కుల్వంత్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 28న ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కామరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్ ఉత్తీర్ణులై 20 నుంచి 35 ఏళ్ల వయసున్న వారు అర్హులని పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాలో 8 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 98492 16362, 73960 13501 నంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

నేడు శూలాల మహోత్సవం

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం శివారు బంగారయ్యపేటలో కార్తీక మాసం రెండో సోమవారం పురస్కరించుకుని చౌడేశ్వరి సహిత సాంబమూర్తి శూలాల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీ సన్నాహాలు చేసింది. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, రాత్రి గంప శూలాలు, సుబ్రహ్మణ్య శూలాలు, బుగ్గ శూలాలు వగైరా ధరించిన భక్తులతో శూలాల ఉత్సవం జరగనుంది. ఈ మేరకు ఏర్పాట్లు చేసినట్లు కమిటీ తెలిపింది.

'ఆరోగ్యమిత్రలను రెగ్యులరైజ్ చేయాలి'

అనకాపల్లి రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వాస్పత్రుల్లో ఏళ్ల తరబడి సేవలందిస్తున్న ఆరోగ్య మిత్రలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆరోగ్య మిత్రల కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సీహెచ్ గోవింద్ డిమాండ్ చేశారు. స్థానిక కోడుగంటి గోవిందరావు భవన్‌లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి సేవలందిస్తున్న ఆరోగ్య మిత్రల సర్వీసును రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు జి.కనకం, మూర్తి, రమణి, నాయుడు, శంకర్, కరుణ, రత్నకుమారి, జయమణి, గన్నేరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

'మేము సైతం' రక్తదానం

అనకాపల్లి రూరల్: మండలంలోని సంపతిపురం పంచాయతీ తమ్మయ్యపేట గ్రామంలో ఆదివారం మేము సైతం సమాజం కోసం సేవా సంస్థ, తమ్మయ్యపేట యువత ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. 31 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. నేత్ర సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారి కోసం ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య నిపుణులతో కంటి పరీక్షలు నిర్వహించారు. సంస్థ సేవలను స్థానికులు అభినందించారు.

ఎన్‌ఎంఎంఎస్ నమూనా పరీక్షకు స్పందన

కశింకోట: స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో స్పందించే హృదయం సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌ఎంఎంఎస్ నమూనా పరీక్షను ఆదివారం నిర్వహించారు. సుమారు 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉత్తమ మార్కులు పొందిన 10 మంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. సంస్థ ప్రతినిధి ఎస్.రమేష్, జిల్లా సైన్స్ అధికారి కాళిదాస్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

ఆదికేశవ	: రాజా
మా ఊరి పొలిమేర-2	: సత్యనారాయణస్క్రీన్-1
స్పార్క్	: సత్యనారాయణస్క్రీన్-2
జిగర్ తండ	: షిర్డిసాయి
కోటబొమ్మాళి	: పర్తిసాయి
-------	: వెంకటేశ్వర
సౌండ్‌పార్టీ	: శ్రీసత్య
మంగళవారం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 15 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-4 యూనిట్లు, బీ నెగిటివ్-1యూనిట్, ఓ పాజిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 258 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 206 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఈమె పేరు సూరిశెట్టి నూకరత్నం. పిసినికాడ పంచాయతీ పరిధి జీఆర్టీ కాలనీకి చెందిన ఈమె భర్త సూరి అప్పారావు మూడేళ్ల క్రితం కరోనాతో చనిపోయాడు. జీవనాధారం కోసం కాలనీలో చిన్న బడ్డీకొట్టు పెట్టుకుంది. ఈమెకు వైఎస్సార్ చేయూత కొండంత భరోసానిచ్చింది. అప్పటివరకు అంతంత మాత్రం ఆదాయం వచ్చేది. ఎప్పుడైతే రాష్ట్ర ప్రభుత్వం చేయూత పథకంతోపాటు, బ్యాంకుల ద్వారా సహకారం అందించిందో నూకరత్నం దశ తిరిగింది. ఆ డబ్బుతో ఊర్లోనే చిల్లర దుకాణం ప్రారంభించింది. ఈమె సభ్యురాలిగా ఉన్న గణేష్ స్వయం సహాయక సంఘానికి రూ.10 లక్షల రుణం మజూరైంది. ఆ డబ్బుతో కూరగాయల వ్యాపారం కూడా మొదలెట్టింది. ప్రస్తుతం రోజూ రూ.3 వేలకు తగ్గకుండా వ్యాపారం జరుగుతోంది. 'సీఎం జగన్ బాబు పుణ్యమా అని మా కుటుంబం ఎవరిపైనా ఆధారపడకుండా ధైర్యంగా బతుకుతున్నామంటూ..' **ఆమె తన సంతోషాన్ని వ్యక్తం చేసింది.**



నా పేరు పూడి విజయ. మాది దిబ్బపాలెం. భర్త భాస్కరరావు లారీ డ్రైవర్. తనకు వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు చాలకపోవడంతో టైలరింగ్ పని చేసేదాన్ని. అయినా ఆర్థిక ఇబ్బందులు తప్పలేదు. శ్రీ భక్త వీరాంజనేయ డ్వాక్రా సంఘంలో సభ్యురాలిగా చేరిన తర్వాత మండల మహిళా సమాఖ్య కార్యదర్శిగా ఎన్నికయ్యాను. ఆ తర్వాత జిల్లా సమాఖ్య ఈసీ సభ్యురాలిగా, ఎఫ్ఎస్ఎల్ కమిటీ సభ్యురాలిగా పొదుపులో మెలకువలపై శిక్షణ తీసుకున్నాను. ప్రస్తుతం ఇంట్లోనే పసుపు, కుంకుమ తయారు చేసి, ఆ ప్యాకెట్లను అమ్ముకుంటూ ఆదాయం ఆర్జిస్తున్నాను. దీనితోపాటు పిండి మిల్లు కూడా నిర్వహిస్తున్నాను. బ్యాంకు లింకేపీ, స్త్రీనిధి రుణం వచ్చింది. గత మూడు విడతల్లో వైఎస్సార్ చేయూత పథకం ద్వారా మొత్తం రూ.56,250 అందుకున్నాను. ఆర్థిక ఇబ్బందులను అధిగమించడానికి చేయూత పథకం తోడ్పడింది. **ఇంత గొప్ప పథకాలతో మహిళలకు అండగా ఉంటున్న సీఎం జగనన్నకే మా మద్దతు.**

- 45 నుంచి 60 ఏళ్ల పేద మహిళలకు భరోసా
- ఏటా వారి వ్యక్తిగత ఖాతాల్లో రూ.18,750 జమ
- చిరు వ్యాపారాలతో ఆర్థికంగా రాణిస్తున్న మహిళలు

అక్కచెల్లెమ్మలకు ఆర్థిక స్వావలంబన

మహిళా సాధికారతకు ప్రాధాన్యం
వైఎస్సార్ చేయూత ద్వారా ఆర్థిక సాయం



చేయూతతో పాటు బ్యాంకు లింకేజీ రుణంతో గొర్రెలు కొనుగోలు చేసిన నమ్మి గంగమ్మ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అందిపుచ్చుకుని కొందరు మహిళలు ఆర్థికంగా దూసుకుపోతున్నారు. కూలి పనులపై ఆధారపడి జీవనం సాగిస్తూ తగిన ఆదాయం లేక సతమతమవుతున్న కుటుంబాలు సైతం సీఎం జగన్ ప్రభుత్వం అందిస్తున్న సాయంతో నిలదొక్కుకుంటున్నాయి. ప్రధానంగా వైఎస్సార్ చేయూత చాలా కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది.



అనకాపల్లి రూరల్: మహిళల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, మధ్యతరగతి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించారు. ఏటా వైఎస్సార్ చేయూత పథకం ద్వారా 45 నుంచి 60 ఏళ్లు నిండిన పేద మహిళలకు ఏడాదికి రూ.18,750 చొప్పున లబ్ధిదారుల వ్యక్తిగత ఖాతాల్లో జమచేస్తున్నారు. ఈ నగదును కొందరు కుటుంబ అవసరాలకు వినియోగిస్తుండగా, చాలామంది చిన్నపాటి వ్యాపారాలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా రాణిస్తున్నారు. తమ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు.

అనకాపల్లి మండలం, అర్బన్‌లో చేయూత లబ్ధి

విడత	లబ్ధిదారులు		లబ్ధి(రూ.కోట్లలో)	
	మండలం	అర్బన్	మండలం	అర్బన్
మొదటి విడత	4386	4150	8.22	7.78
రెండో విడత	4950	4471	9.28	8.38
మూడో విడత	6042	5096	11.33	9.56

చేయూతతో పాటు బ్యాంకు రుణాలు

మండలంలోని మహిళలు ఎవరిపైనా ఆధారపడకుండా ప్రభుత్వం అందిస్తున్న చేయూత, డ్వాక్రా రుణాలతో ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. టైలరింగ్, కిరాణా, పాన్‌షాపు, చెప్పులు, కూరగాయల దుకాణాలు, మట్టి బొమ్మలు, కొవ్వొత్తుల తయారీ, పశువుల పెంపకం, అల్పాహారం, భోజన హోటళ్లు, కోళ్ల పెంపకం, దుస్తుల అమ్మకం వంటి వ్యాపారాలతో వారి జీవనశైలిని మెరుగుపర్చుకుంటున్నారు. దీంతో సీఎం జగన్ ప్రభుత్వంపై మహిళలకు మరింత నమ్మకం చేకూరింది. గతంలో పొదుపు సంఘాల మహిళలకు రూ.2 లక్షలు, రూ.3 లక్షలు కూడా రుణాలు అందని పరిస్థితి. ఇప్పుడు మహిళా సంఘాలకు వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ పథకాల ద్వారా విరివిగా బ్యాంకు రుణాలు అందుతున్నాయి. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు డ్వాక్రా రుణమాఫీ హామీని నిలబెట్టుకోకుండా మోసం చేయడంతో మహిళా సంఘాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. ఇప్పుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన చేయూతతో మహిళలు సకాలంలో బ్యాంకు రుణాలు చెల్లించడమే కాకుండా ఒక్కో సంఘానికి గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు కూడా రుణాన్ని పొందగలుగుతున్నారు.



జీఆర్టీ కాలనీలో వైఎస్సార్ చేయూత సాయంతో సొంతంగా చీరలు విక్రయిస్తున్న ఎల్లపు చెల్లయ్యమ్మ



అక్కిరెడ్డిపాలెంలో చేయూత నిధులతో కిరాణా కొట్టు నిర్వహిస్తున్న సత్యవతి

ఈ ప్రభుత్వ సాయంతోనే..



ప్రభుత్వం అందిస్తున్న సాయం ఎంతగానో ఉపయోగపడింది. వైఎస్సార్ చేయూత ద్వారా మూడు సార్లు లబ్ధి పొందాను. మొదటిసారి ఆ డబ్బుతో పాటు నా వద్దనున్న మరి కొంత మొత్తాన్ని జత చేసి ఊర్లోనే చిన్న కిరాణా షాపు పెట్టుకున్నాను. ఎవరిపై ఆధారపడకుండా గౌరవప్రదంగా జీవిస్తున్నాను. ఈ ప్రభుత్వం మాలాంటి వాళ్లను ఎంతగానో ఆదుకుంటోంది. మహిళలకు ఆసరాగా నిలుస్తున్న సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

– జమ్మల అప్పలనర్సమ్మ, మాకవరం

మంచి చేస్తున్న జగనన్న



వరుసగా మూడేళ్లు వైఎస్సార్ చేయూత డబ్బులు వచ్చాయి. తొలి విడత డబ్బులతో కిరాణా అంగడి పెట్టుకున్నా. తర్వాత వచ్చిన వాటితో షాపులో సరకుల స్టాక్ ఎక్కువ చేశాను. కరోనా కష్ట కాలంలో జగనన్న సాయం మాకు ఎంతగానో ఉపయోగపడింది. ఇచ్చిన మాట ప్రకారం 45 ఏళ్లు నుంచి 60 ఏళ్ల లోపు ఆడవాళ్లందరికీ డబ్బులేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– భీశెట్టి లక్ష్మి, వెంకుపాలెం

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు



మహిళలు లక్షాధికారులు కావాలన్న ప్రభుత్వ లక్ష్యం అభినందనీయం. నిరుపేద మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం ఒక వరం. పెద్ద మనసున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్ల మాలాంటి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతోంది. చేయూతతో పాటుగా లక్ష రూపాయల బ్యాంకు లింకేజి రుణం కూడా వచ్చింది. చిల్లర దుకాణం నడుపుకుంటున్నాను. ఈ పథకం మా ఆర్థిక ప్రగతికి వారధిగా నిలుస్తోంది.

– జమ్మల నవరత్నం,
సాయిరాం స్వయం సహాయక సంఘం, మాకవరం

ఊరూవాడా కార్తీక పౌర్ణమి శోభ



కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ధ్వజ స్తంభం వద్ద దీపారాధనలో భక్తులు



కశింకోట ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆకాశ దీపాలను సిద్ధం చేస్తున్న భక్తులు

అనకాపల్లిటౌన్: పట్టణంలో ఆదివారం కార్తీక పౌర్ణమి సందర్భంగా శివాలయాలు శివనామస్మరణతో మారుమ్రోగాయి. ఆలయాలకు భక్తులు తెల్లవారుజాము నుంచే బారులుతీరి స్వామివారిని దర్శించుకున్నారు. గవరపాలెం భోగలింగేశ్వర స్వామి, కూరగాయల మార్కెట్ వద్ద సాధువుల ఆలయం, కన్యకాపరమేశ్వరి, సాంబశివుని ఆలయం, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళా భక్తులు ఆయా ఆలయ ధ్వజ స్తంభాల వద్ద దీపారాధన చేశారు. సిద్ధి లింగేశ్వరస్వామి ఆలయం రహదారిలో జ్వాలాతోరణం వెలిగించారు. ఈ తోరణం కింది నుంచి భక్తులు నడిస్తే సకల పాపాలు హరిస్తాయని నమ్మకం. దీంతో జ్వాలా తోరణం వెలిగించే రాత్రి 8 గంటల వరకు భక్తులు భారీ సంఖ్యలో ఎదురు చూశారు.

కశింకోట: స్థానిక సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆదివారం రాత్రి భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తుల దీపారాధనలతో దేదీప్యమానమయింది. పరిసరాలు శివ నామస్మరణతో మార్మోగాయి. మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరై ధ్వజ స్తంభం, నందీశ్వరుని వద్ద పెద్ద ఎత్తున దీపారాధనలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జ్వాలా తోరణం నిర్వహించారు. దీన్ని వెలిగించిన కొద్ది సేపటికే తాడు తెగి కింద పడిపోవడంతో అక్కడ ఉన్న భక్తులు ఆందోళన చెందారు. అదృష్టవశాత్తూ ఎవరికీ ప్రమాదం జరగలేదు. సర్వమంగళాంబ, త్రిపురాంతకస్వాముల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి ఆలయం చుట్టూ జ్వాలా తోరణం మీదుగా ఊరేగించారు. భక్తులు పల్లకిని మోయడానికి పోటీ పడ్డారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆలయ అర్చకులు వి.చిదంబం, వి.కృష్ణల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని సంప్రదాయంగా నిర్వహించారు.

▸ స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆకాశ దీపోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా పూజలు నిర్వహించి, ఆకాశ దీపాలను వెలిగించారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కశింకోటలో శివాలయం వద్ద జ్వాలా తోరణం



కశింకోటలో ధ్వజ స్తంభం వద్ద దీపారాధన



పల్లకిలో స్వామివార్లకు భక్తుల పూజలు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



కశింకోట బాలికల హాస్టల్లో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న సీఐ రవిబాబు

కశింకోట: భారత రాజ్యాంగంపై బాలికలకు మరింత అవగాహన ఉండటం అవసరమని అనకాపల్లి రూరల్ సీఐ రవికుమార్ అన్నారు. కశింకోటలోని సమగ్ర బాలికల వసతి గృహంలో ఆదివారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నవ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ రాజ్యాంగానికి లోబడే చట్టాలు పని చేస్తాయన్నారు. క్విజ్, పాటల పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందించారు. పీఆర్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గంట్యాడ అప్పారావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వేగి దొరబాబు, దళిత సేవా పరిరక్షణ జిల్లా అధ్యక్షుడు యాదగిరి దాసు, గంట్యాడ రమణ, డీవీఎంసీ సభ్యులు ఎం.అప్పలరాజు, రేబాక మధుబాబు, వసతి గృహం సీఈవో నిర్మల పాల్గొన్నారు.

▸ కశింకోట పోలీసు స్టేషన్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి అదనపు ఎస్ఐ జె.నాగేశ్వరరావు పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంత్రి జయరజని, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్, దళిత నాయకులు దొమ్మేసి సత్యారావు, మంత్రి అప్పారావు, శివలంక కామేష్, చంటి తదితరులు పాల్గొన్నారు.

▸ తాళ్లపాలెం గ్రంథాలయంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగానికి, చట్టాలకు కట్టుబడి ఉంటామని ప్రమాణం చేశారు. గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

అనకాపల్లి రూరల్: భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా మహాసభలు అనకాపల్లిలో ఆదివారం ఘనంగా జరిగాయి. రాష్ట్ర కార్యదర్శి అశోక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ నూతన విద్యా విధానంతో విద్యారంగానికి చాలా నష్టం జరుగుతోందని ఆరోపించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా ప్రతినిధి సీహెచ్ పావని, జిల్లా కార్యదర్శి ఎస్.రమణ, అధ్యక్షుడు మామిడి రమణ, కోశాధికారి జి.తరుణ్, ఉపాధ్యక్షుడు గీతాకృష్ణ, జాయింట్ సెక్రటరీ బాలాజీ, సభ్యులు కేశవ, వెంకటేశ్, శ్రీను పాల్గొన్నారు.

వచ్చే నెల్లో పూర్వ విద్యార్థుల పిక్నిక్

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాంలె విశాఖ ఫైనాన్షియర్స్ సంక్షేమ సంఘం హాల్లో జీవీఎంసీ చిన్న హైస్కూల్ 1970 నుంచి 75 విద్యా సంవత్సరాల్లో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. ఆత్మీయ స్నేహితుల సంఘం గౌరవ అధ్యక్షుడు బొడ్డేడ అప్పారావు, అధ్యక్షుడు బల్లా నాగభూషణం మాట్లాడుతూ వచ్చే నెల బొజ్జన్నకొండ వద్ద నిర్వహించే పిక్నిక్‌కు ఆయా బ్యాచ్‌ల విద్యార్థులంతా హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమావేశానికి హాజరుకాని, వివిధ ప్రాంతాల్లో నివసించే పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా పిక్నిక్‌కు వచ్చేలా ప్రయత్నాలు చేస్తామన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ, సేవాభావం

అనకాపల్లి రూరల్: అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవ కార్యక్రమాలు జరిగాయి. ఎన్‌సీసీ వలంటీర్లు స్వచ్ఛ శారదా కార్యక్రమంలో భాగంగా శారదానదీ పరీవాహక ప్రాంతంలో శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్‌సీసీతో క్రమశిక్షణ, సేవాభావం అలవడుతుందన్నారు. ఎన్‌సీసీ కేడెట్లకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్ పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, ఎన్‌సీసీ అధికారులు కెప్టెన్ దాడి జగదీష్, లెఫ్టినెంట్ ఏఎస్ఎన్ మూర్తి, ఇంగ్లిష్ ప్రొఫెసర్ డాక్టర్ సుధాకర్, కళాశాల సూపరింటెండెంట్ అనూరాధ, జీవీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి, శ్రీనివాసరావు, 120 మంది ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

అనకాపల్లిటౌన్: బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అందజేస్తున్నాయని, అర్హులైన లబ్ధిదారులు వాటి ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని మారేడుపూడి సచివాలయం, తారక రామారావుకాలనీల్లో ఆదివారం జన జాతీయ గౌరవ దివాస్-2023, వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాలను ప్రారంభించారు. అంతకు ముందు జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సర్పంచ్‌లు సాలాపు కనకసన్యాసరావు, సాలాపు శాంతి, ఎంపీడీవో కె.నరసింహారావు, ఈవోఆర్డీ ధర్మారావు, పీఏసీఎస్ డైరెక్టర్ నారిపిన్ని ప్రసాద్, సచివాలయం కన్వీనర్ ఎ.ధనలక్ష్మి, ఎంపీటీసీ ఈగల రామునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈగల కృష్ణమూర్తి, పంతం శ్రీనివాసరావు, సీతారామరాజు పాల్గొన్నారు.